# సంస్కృతి



పి.రామకృష్ణ

ఆదినారాయణంటే ఆదినుంచీ నాకెందుకో చిరాకు. ఎందుకో అని ఎందుకంటున్నానంటే, అతను మనిషి మంచివాడే. ప్రవర్తన కూడా బాగానే వుంటుంది. మనిషి మంచివాడై, ప్రవర్తన బాగానే వుండీ మరెందుకు చిరాకు కలిగిస్తున్నాడో తెలీకనే 'ఎందుకో' అన్నాను. అయితే, అంత మరీ తెలీకుండానూ అన్లేదులెండి. కొంత తెలుసు. "కొంత తెలిసాక చిరాకు కలిగిస్తున్నాడా, ఆ కొంత కూడా తెలీని ఆదినుంచీ చిరాకు కలిగిస్తున్నాడా?" అనడిగితే, నేనేం చెప్పలేను. మాటవరు సకు అన్న ఆ 'ఆది'ని తీసేసి, తెలిసిన 'కొంత'ను గురించి ముందు చెబుతాను. అన్నట్టు. ఆదినారాయణలోవున్న 'ఆది'ని తీసేసి, నేను 'నారాయణా' అనే పిలుస్తుంటాను కనుక, అతన్ని నారాయణగానే పరిచయం చేస్తాను.

ఈ దేశంలో పుట్టి, పెరిగి, ఇక్కడ బతుకుతూ... ఈ దేశ సంస్కృతి అంటే ఏమిటో తెలుసుకోని నారాయణ లాంటి వాళ్ళు ఎందుకు బతుకుతారో అర్ధంకాదు. పైగా, "సంస్కృతి అంటే ఏమిటి?" అనడుగుతాడు! ఏమని చెబుతాం? ఫలానాది అని ఎలా చెప్పగలం? అర్ధం చేసుకోవాలి. అంతే. అదేమంత కష్టమైనది కూడా కాదు. ఈ మట్టిన పుట్టిన వాళ్ళకు అది సహజంగానే అర్ధమవుతుంది. ఆమాటే నారాయణతో అంటే, "అర్ధం చేసుకోవడం కష్టం కానిది, చెప్పడానికెందుకు కష్టంగా వున్నట్టు?" అనడిగాడు. ఎగతాళి చేస్తున్నాడా? ఛాలెంజ్ చేస్తున్నాడా? నారాయణ ముఖంకేసి చూసాను. ఆ ముఖంలో అటువంటి సూచనేదీ కనిపించలేదు. నయం, అవమానించడంలేదు. కొంచెం స్థిమితపడ్డాను. తెలీకనే అడుగుతున్నాడని నమ్మాను.

అయితే, అటువంటి నమ్మకాన్ని అలాగే వుండనీకుండా నారాయణ అప్పుడప్పుడూ కదిలించి, అనుమానం కలిగించేవాడు. ఒకమనిషి ఎలాంటివాడో తెలిస్తే, ఇక అతన్ని గురించి ఆలోచించే అవసరముండదు మనకు. ఎలాంటి వాడో తెలీకపోతేనే ఇబ్బంది. నారాయణ కలిగించిన ఒకటి, రెండు ఇబ్బందులను గురించి చెబుతాను. ఆరోజు పత్రికల్లో ప్రముఖంగా వచ్చిన ఒక అంశం గురించి, ఆఫీసు 'లంచ్అవర్'లో చర్చ జరిగింది. "సరస్వతీ వందనంపై లోక్‌సభలో పెద్ద రభస" అన్న హెడ్డింగ్‌తో వున్న నాలుగు కాలమ్‌ల వార్త అది. అన్ని పత్రికల్లోనూ ఇంచుమించు అదే అర్ధంతో, అదే స్థాయిలో వచ్చింది. నిజానికి నాకారోజు 'లంచ్' తీసుకోవాలనిపించలేదు. " ఈ దేశం ఎక్కడికి వెళ్తోంది?" అన్న బాధతోనే వుండిపోయాను.

"సరస్వతీ ప్రార్ధనకు అంత అభ్యంతరమెందుకో అర్ధంకాదు" అన్నాను. ఆ మాటతో నా ఆగ్రహం, ఆవేదన వ్యక్తమై వుండవచ్చు. అంతవరకూ ఏమీ మాట్లాడకుండా 'లంచ్' తీసుకోవడమే లక్ష్యంగా వున్న నారాయణ, బాక్సును సంచిలో సర్దుకుంటూ నాకేసి నవ్వుతూ చూసాడు.

"అందరూ సరస్వతీ ప్రార్ధన చేసి తీరాలన్న పట్టుదల ఎందుకో అర్ధమయిందా?"

"పట్టుదల ఏముందీ? 'తల్లీ! నిన్ను తలంచి పుస్తకము చేతన్ పూనితిన్' అని ప్రార్థించడం మన సంప్రదాయం, మన సంస్కృతి. గుడ్డిగా పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడిపోయి, మన సంస్కృతినీ సంప్రదాయాన్నీ మనమే అవమానిస్తున్నాం"

"అంటే, సరస్వతీ ప్రార్ధన చెయ్యడమే మన సంస్కృతి అన్నమాట. ఈపాటి దానికి, సంస్కృతి అంటే ఏమిటని అడిగితే చెప్పారు కాదు"

"సంస్కృతి అంటే సరస్వతీ ప్రార్ధన చెయ్యడమేనని ఎవరన్నారు? మన సంస్కృతిలో అదొక భాగమన్నాను"

"సరి. ఆ మాత్రానికి మన సంస్కృతి, సంప్రదాయమూ మంట కలిసినట్టు బాధపడటమెందుకు?" అని, లేచి తన సీటు దగ్గరకి వెళ్ళాడు.

ఇంకోసారి, నగరంలో జరుగుతున్న గణేశ నవరాత్రి ఉత్సవాల గురించి మాట్లాడుకుంటున్నాం. "బలవంతంగా చందాలు వసూలు చేయడమూ, రోడ్లను బ్లాక్ చేసి పందిళ్ళు వేయడమూ, మైకులతో జనానికి పిచ్చెక్కించడమూ... ఇదంతా కూడా మన సంస్కృతిలో భాగమేనా?" అనడిగాడు. అంతవరకూ ఉత్సవోత్సాహం గురించీ, వినాయక విగ్రహాల గురించీ నడుస్తున్న చర్చను పక్కదారి పట్టించాడు. ఆ పనులు మంచివి కావని దాదాపు అందరూ అన్నారు. అయితే, అటువంటి పనులకూ సంస్కృతికీ సంబంధంలేదని... ఏకగ్రీవంగా అన్నారు. నారాయణ అంతటితో వూరుకోవచ్చు, కానీ వూరుకోలేదు. "సంబంధంలేదంటేనే సరిపోదు. ఉత్సవాలు సంస్కృతిలో భాగంగా జరుగుతుంటే, ఆ అక్రమాలు ఉత్సవాలలో భాగంగా జరుగుతున్నాయి. సంబంధంలేని ఆ రెండూ కలగలసి ఎందుకు జరుగుతున్నట్టు?" ఆ ప్రశ్నకు నాకో మంచి సమాధానం తట్టింది. అందుకు కొంచెం గర్వపడ్డాను కూడా.

"చూడు నారాయణా! మనం ఒక దీపాన్ని వెలిగించినప్పుడు, నీడ కూడా వుంటుంది. నీడ వుంటుందని దీపాన్ని వెలిగించకుండా వుండం"

నెమ్మదిగా, గంభీరంగా అన్న నామాట పూర్తయీ కాకముందే, ఏమాత్రం నెమ్మదీ, గంభీరతాలేని నారాయణ మాట దూకింది.

"అంటే, సంస్కృతికి వెలుతురూ, నీడా వుంటుందన్నమాట. మరి, మొత్తం వెలుతురు ముద్ద అయినట్టు మాట్లాడ్డమెందుకు?"



ఇదీ నారాయణ తీరు! ఒక విషయాన్ని సక్రమంగా గ్రహించకుండా అడ్డదిడ్డపు ప్రశ్నలు వేస్తే ఏం చెబుతాం? అటువంటి ప్రశ్నలకు సరైన జవాబులు ఎలా వుంటాయి? ఇప్పుడు చెప్పిన ఈ రెండు సందర్భాలూ ఇంతకుముందటివి. ఆ సంగతి మీకు ముందే చెప్పాను. ఇప్పుడు చెప్పబోయేది నాలుగురోజుల నాటిది. ఇదికూడా చెప్పేస్తే,

అప్పుడు మీకు నారాయణ ఎలాంటివాడో అర్థమవుతుంది. "నారాయణంటే నాకెందుకో చిరాకు" అని నేనెందుక నా[illegible]గహిస్తారు.

** ** **

నాలుగు రోజుల నాటి ఆరోజు, ఆదివారం. మా ఇంట్లో మిగతా రోజుల్లో వుండని 'టిఫిన్' సౌకర్యం ఆరోజు ఉంటుంది. చపాతీ తిని, చెయ్యి కడుక్కుని, ఇక వసారాలో కూచుని తృప్తినీ, విశ్రాంతినీ అనుభవిద్దామని వచ్చేసరికి... అక్కడ నారాయణ కూచొని వున్నాడు! కొంచెం విసుగూ, ఎక్కువ ఆశ్చర్యమూ కలిగాయి.

"హలో! ఎంతసేపయింది వచ్చి? చప్పుడు చెయ్యకుండా కూచున్నారేమిటి?... అని పలకరించాను. ఎవరెలాంటివారైనా, ఇంటికొచ్చినప్పుడు మర్యాదగా పలకరించడం మన సంస్కృతి. మన సంస్కృతి మీద అపారగౌరవమున్న నేను అందుకు భిన్నంగా ఎలా ప్రవర్తిస్తాను?

"ఇప్పుడే. మీరింట్లో మాట్లాడుతుంటే. పిలవడమెందుకు బయటికొస్తారుకదాని, కూచున్నాను"

"ఇవాళ మా ఇంటికి రానున్నట్టు నిన్న ఆఫీసులో చెప్పలేదు మరి?"

"అప్పటికి తెలీదు. ఇంటికెళ్ళేసరికి మా మిత్రుడి ఉత్తరముంది. పదిరోజుల క్రిందట అతనిక్కడికి బదిలీ అ[illegible] వచ్చాడట. చైతన్యపురిలో ఇల్లు తీసుకున్నాడట, అ[illegible]న్నాడు. వెళ్తుండగా, మీరిక్కడ శాంతినగర్‌లో వుం[illegible] గుర్తుకొచ్చింది. ఆదివారమేకదా, మీరూ వస్తే పరిచయం లేని ఈ ప్రాంతంలో నాకు సహాయ పడతారనిపించింది. ఇప్పుడు మీకు వేరే పనేదైనా వుందా?"

సహాయ పడతానని వచ్చినట్టు చెబుతున్నాడు! ఏదో పనివుందని చెబుదామా... అనుకున్నాను. అయితే, నా సమయ స్ఫూర్తి నాకు సహాయపడింది. పెద్ద పనేంకాదు, నన్నే రికమెండేషన్ చెయ్యమనడంలేదు. నడిచి వెళ్ళినా, అరగంటలో వెళ్ళి రావచ్చు. ఏదో పనివున్నా, దాన్ని వాయిదా వేసుకుని, తనతో వస్తున్నట్లు నారాయణ భావించేందుకుగాను ఒంటివేళ్తో జుట్టు గోక్కుని, తలూపి... "సరే వెళ్దాంలే" అని ఇంట్లోకెళ్ళాను. ఈ మాత్రం నటించినందుకు నాకేం సిగ్గనిపించలేదు. అతనికి నేను విలువ ఇస్తున్నట్టు కనిపిస్తే, అతనూ నాకు విలువ ఇవ్వొచ్చు. ఇకమీదట, నేను చెప్పేదేన్నయినా కనీసం బైటికన్నా తేలిక చేసి మాట్లాడకుండా వుండొచ్చు. బట్టలు మార్చుకుని, మా ఆవిడ ఇచ్చిన రెండు కాఫీ కప్పుల్ని పట్టుకుని మళ్ళీ వసారాలోకి వచ్చాను.

నారాయణకు ఓ కప్పు అందించి కూచున్నాను. అతడు తన స్నేహితుడి గురించీ, ఉభయుల కుటుంబాలూ వ[illegible]ల్లుల్లో పక్కపక్కనే మూడేళ్ళు వుండటం గురించీ చె[illegible]తుంటే, వూ కొడుతున్నాను. ఇంతలో గేటు తీసిన చప్పుడయింది. ఆ తర్వాత "ఎవరండీ ఇంట్లో?" అన్న కేక వినిపించింది. ఆ వెంటనే ఇద్దరు మనుషులు కాంపౌండ్ లోపలికి రావడం కనిపించింది. యాభై, అరవయ్యేళ్ళ మధ్యన వున్నట్టున్నారు. ఒకాయన ఎర్రగా, పొట్టిగా, లావుగా, తోసుకొచ్చిన బొజ్జతో, నెరసిన గడ్డంతో వుంటే... ఇంకొకాయన బక్కగా, పొడుగ్గా, నున్నటి [illegible]ంతో, తలతో, తలమీద పిలకతో వున్నాడు. ఇద్దరూ బిళ్ళగోచీ పోసి కట్టిన పంచెలతో, పల్చటి, తెల్లటి ఉత్తరీయాలు కప్పుకున్న ఊర్ధ్వ శరీరాలతో, యజ్ఞోపవీతా[illegible] వున్నారు. పొట్టిగా వున్న ఆయన చేతిలో మెరుస్తున్న చెంబు వుంటే, పొడుగాటి ఆయన చేతిలో శిథిల దశలో వున్న ఏదో పుస్తకం ఉంది.

"బ్రాహ్మలమొచ్చాము, మీకు తోచిన విధంగా సత్కరించండి"

ఇద్దరూ ఒకేసారి అన్నారు. సంస్కృత ఆశీర్వచనాలు చదవడం ప్రారంభించారు. బిగ్గరగా వున్న ఆ గొంతులు విని, మా ఇంటికి అటువక్కనా, ఇటుపక్కనా వున్న వాళ్ళు కాంపౌండ్ గోడల మీదుగా తొంగి చూశారు. టీవీ, రేడియో శబ్దాలు కాకపోవడం వాళ్ళ కుతూహలానికి కారణమై వుండొచ్చు. అయితే, ఇది అపూర్వ అసాధారణ సందర్భమేమీకాదు. వీళ్ళు అప్పుడప్పుడూ ఇలా రావడం మామూలే. వీళ్ళు ఈరోజు, ఈ నారాయణ వున్నప్పుడు మా ఇంటికి రావడం నాకేదో కొంచెం ఇబ్బంది అనిపించింది. కానీ, వెంటనే సర్దుకున్నాను. నేనలా భావించడమే తప్పు. నారాయణ వుంటే నాకేం? ఇంకా అతను వున్నప్పుడు వాళ్ళు రావడమే మంచిది. కేవలం మాటల ద్వారా కాకుండా, ఆచరణ ద్వారా కూడా మన సంస్కృతిని నేనెంతగా గౌరవిస్తున్నదీ అతనికి చూపించవచ్చు. జేబులో వున్న పదినోటుతీసి, లావాటి ఆయన పట్టుకున్న చెంబులో వేసాను. ఆ ఇద్దరూ మళ్ళీ ఒకేసారి 'శుభం భుయాత్' అని నిష్క్రమించారు.

వాళ్ళ వెంటనే చూపును పోనిచ్చిన నారాయణ వాళ్ళు గేటు దాటాక నావేపు తిరిగి "ఇది కూడా మన సంస్కృతేకదా!" అనడిగాడు. అతనలా అడుగుతాడని అనుకున్నదే.

"వైనాట్?" అన్నాను నవ్వుతూ.

"గణేశ్ ఉత్సవాలలో చందాలు వసూలు చేయడం లాంటి దౌర్జన్యమే ఇదికూడా"

"అదేమిటి! వీళ్ళేం దౌర్జన్యం చేసారు? ఇచ్చింది తీసుకుని ఆశీర్వదించి వెళ్ళారు పాపం!"

"ఇందులో ఉన్న దౌర్జన్యమేమిటో తెలీకపోతే, దీన్ని గురించి మీతో మాట్లాడ్డం అనవసరం" అని లేచాడు. ఆ మొరటుతనానికి నాకు ఆశ్చర్యం కలిగింది. నా సహాయం కోరి, నాకోసం వచ్చిన మనిషి! "నేను రాలేను, మీరు వెళ్ళండి" అందామనుకున్నాను. వస్తానని చెప్పి, ఇప్పుడు రాననడం బావుండదని చేసేదిలేక నేనూ బయల్దేరాను.

చైతన్యపురిలో నారాయణ స్నేహితుడి ఇల్లు తేలికగానే తెలుసుకున్నాం కానీ, ఇంటికి తాళం వేసి వుంది. ఇంటివాళ్ళే పక్కింటివాళ్ళు. వాళ్ళనడిగితే, నారాయణా, ఆయన భార్య, పిల్లలూ గంట క్రితమే ఆటోలో ఎక్కడికో వెళ్ళారనీ, ఎక్కడికెళ్ళారో, ఎప్పుడొస్తారో తమకు తెలీదనీ చెప్పారు. తను వస్తున్నట్టు వాళ్ళకు తెలీదు కనుక ఇలా జరిగి వుంటుందని అన్నాడు నారాయణ. ఇద్దరం వచ్చి వెళ్తున్నామనీ, ఫలానా నెంబర్ ద్వారా తనతో ఫోన్లో మాట్లాడమనీ ఓచిన్న కాగితంలో రాసి పక్కింటి వాళ్ళకిచ్చాడు నారాయణ. ఇద్దరం తిరుగుముఖం పట్టాము. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ దగ్గరికొచ్చేసరికి, నా ఎడమ కాలి చెప్పు తెగింది. అదీ ఏ ఉంగటమో కాక గూడ కావడంతో నడవడం సాధ్యంకాలేదు. పారేద్దామా అంటే మరీ పాతవేం కావు. మూన్నెళ్ళక్రితం కొన్నవి. నా పరిస్థితి గ్రహించిన నారాయణ అటూఇటూ చూసి "అదుగో! అక్కడ కుట్టిద్దాం" అన్నాడు.

సాయిబాబా గుడివీధి మొగదల మురికాల్వ పక్కన ఓ ముసలాడు మూడు నాలుగు పాత చెప్పుల జతలు ముందేసుకుని కూచొని వున్నాడు. ఇద్దరం దగ్గరికెళ్ళి నిల్చొనేసరికి, తలెత్తిచూసి ఆ తర్వాత మా కాళ్ళకేసి చూసి ఎందుకొచ్చిందీ గ్రహించినట్టున్నాడు. కొంచెం సర్దుకుని ఎలక్ట్రిక్ పోల్‌కు ఆనుకున్నాడు. నల్లగా, బక్కగా వుండి కండరమన్నదే కనిపించని తొడమీదికి, మాసి, చిరిగిన పంచెను లాక్కున్నాడు. నేను కాలితో ముందుకు తోసిన చెప్పును చెయ్యిసాచి అందుకున్నాడు. తొడుక్కున్న గుడ్డ బనియన్ భుజం మీద చిరిగి ఓ పక్కకు వేలాడుతోంది. చెప్పును మోకాలిమీద వుంచుకుని, తెగిన పట్టీని లోపలికి తోసి, ఏదో దబ్బనంలాంటి దానికి దారం ఎక్కించి (ఆ దబ్బనంలాంటి దాన్ని ఏమంటారో నాకు తెలీదు) చెప్పు అదుక్కు దించడానికి ప్రయాసపడుతున్నాడు. చేతుల్లో ఏమాత్రం బలం వున్నట్టు లేదు, కొద్దిగా వణుకుతున్నాయి కూడా.

నారాయణ అతని పక్కన గొంతుక్కూచున్నాడు. ఆ దుమ్ములో, మురికాల్వ దగ్గర, చెప్పులు కుట్టే ముసలాడి పక్కన కూచోడానికి నారాయణేమీ సంకోచించలేదుకానీ, నాకు సిగ్గనిపించింది. తెలిసిన వాళ్ళెవరైనా చూస్తున్నారేమోనని అటూఇటూ చూసాను. ఎందుకైనా మంచిదని, ఆ ఇద్దరితో నాకేమీ సంబంధం లేనట్టు కనిపించేలా కొంచెం దూరంలో ఎటో చూస్తూ నిల్చున్నాను. కానీ,

## అనగనగా ఓ 'ఆడపిల్ల'తండ్రి

ఒక్కోసారి ధనవంతుల దగ్గర డబ్బులు గుంజడానికి బెదిరింపులు వస్తుంటాయి. ఫలానారోజు, ఫలానా సమయానికి, ఫలానా వ్యక్తికి ఇన్ని వేలు...లేదా లక్షలు...కొండొకచో కోట్లు అప్పగించమని చెప్పటం జరుగుతుంటుంది. ఇది అడపాదడపా వినే, లేదా పేపర్లో చదివే వ్యవహారమే! అయితే ఇలాంటి బెదిరింపుల కథల్లోనూ ఓ కొసమెరుపు కథ ఉంది. ఇటీవల జరిగిన కథలో కథానాయకుడు ఓ పెద్దబిజినెస్‌మేన్. ఆయన తన కూతురుకు పెళ్ళి చేయాలనుకున్నాడు. పెళ్ళికుమారుడి తరఫువారి కోర్కెల ప్రకారం పెళ్ళిని ఘనంగా చేయడానికి నిశ్చయించాడు. రిసెప్షన్ వగైరా కార్యక్రమాలకు యాభైలక్షలవరకు ఖర్చవుతుందని ఖరారయింది. ఉన్నట్టుండి పెళ్ళికుమారుడి తల్లిదండ్రులను పిలిపించి "అయ్యా, అమ్మా నేను నాకూతురి పెళ్ళిని ఘనంగా చేయాలనుకుంటున్న సంగతి బాగా ప్రచారం అయిపోయినట్టుంది. నాకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. లక్షల్ని డిమాండ్ చేస్తున్నారు" అని లబోదిబోమన్నాడట. పాపం అనుకుని జాలివడ్డ పెళ్ళికుమారుడి తల్లిదండ్రులు (పెళ్ళికొడుకు తరఫు వారిలో జాలిచూపువారు కలరయా) "ఫోన్లే పాపం మీరు మాత్రం ఏం చెయ్యగలరు. పెళ్ళి తంతు సింపుల్‌గానే చేసేయండి. ఓ పోలీస్ కంప్లెయింట్ కూడా ఇవ్వండి" అని చెప్పారట. పరమానందభరితుడైన పెళ్ళికూతురు తండ్రి వియ్యంకులవారు చెప్పింది తుచ తప్పకుండా చేశారు.



ఈ కథలో కొసమెరుపు ఏమిటంటే ఇదంతా పెళ్ళి కూతురి తండ్రి ఆడిన ఉత్తుత్తి బెదిరింపు నాటకం కావడం. పోలీసులు విషయాన్ని షరామామూలుగా చివరాఖరుకు కనిపెట్టడం, పెళ్ళికుమారుడి తరఫువారు ఆగ్రహించడం, పెళ్ళికూతురు సైతం తండ్రిపై ఒకింత కోపాన్ని ప్రదర్శించడం జరిగిందట. అయితే ఏందట...ఆ బిజినెస్‌మేన్‌కు దుబారా ఖర్చు తగ్గి లక్షలు మిగిలిపోలేదూ!!

కథ

ఆ ఇద్దరి మాటలు మాత్రం వినిపిస్తున్నాయి.

"కుట్టగలవా?"

"అట్టంటవేంది?" రోషమొచ్చినట్టుంది ముసలాడికి. తర్వాత, సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టుగా "బీమార్‌పడి వేస్తిగదా!" అన్నాడు.

"ఏవూరు?"

"నల్లగొండ"

"పేరు మల్లయ్య"

"ఏమన్న తిన్నవా?"

"ఏం తింట! ఇంతజల్దీ పైసలు కావద్దా?"

"కొడుకులు, కూతుళ్ళు, పెండ్లాలు ఎవరూ లేరా?"

చివరి ప్రశ్నకేమో ముసలాడు నవ్వాడు. అతన్ని నవ్వించాలనే నారాయణ కూడా అడిగినట్టుంది. నవ్వుతోపాటు తెరలుతెరలుగా దగ్గు వచ్చింది. ఒకదగ్గర దగ్గు ఆగాక...

"ఒక్క పెండ్లాముండె, అదీపాయె. ఇంగ కొడుకులూ, కూతుళ్ళు అందరూ దేశం మీదికి దెంకపాయిరి"

ముసలాడు గడుసువాడే! ఎటొచ్చీ, కొడుకులూ కూతుళ్ళూ 'దెంకపాయిరి' అనడమే అసహ్యంగా వుంది. అది వాళ్ళ సంస్కృతి! నాకాలి దగ్గరికి జరిపిన చెప్పును, ఎడమ చేత అందుకుని చూసాను. బాగానే కుట్టినట్టుంది. చెప్పు కాలికేసుకుని, జేబులో చెయ్యిపెట్టి చిల్లర కోసం వెతికాను. ఒక పద కాగితమూ, ఇంకో అయిదు రూపాయల నాణెమూ వున్నాయి. పదికంటే, అయిదు తక్కువ దబ్బే. అయితే, చెప్పు కుట్టినందుకు ఇచ్చేదానికి చాలా ఎక్కువే. ఏంచెయ్యాలి? ఎవరైనా చిల్లర ఇస్తారా... అని చూస్తున్నాను. ముసలాడితో మాట్లాడుతూనే వున్న నారాయణ నావైపు చూసి, తన జేబులో నుంచి ఏదో నాణెం తీసి ముసలాడి పక్కన వుంచి లేచాడు. రెండు రూపాయల బిళ్ళ అయి వుంటుందనుకున్నాను. అయినా, అనుమానం తీర్చుకుందామని చూస్తే, అయిదు రూపాయల బిళ్ళే! నా చెప్పు కుట్టినందుకు నారాయణ ఇవ్వడం, అదీ అయిదు రూపాయలు కావడం నాక్కొంచెం ఇబ్బంది అనిపించింది.

"అయిదు రూపాయిలిచ్చారెందుకు? చిల్లరచేసి ఇచ్చేవాళ్ళంగదా!"

"ఫర్వాలేదు పదండి"

ఇద్దరం దిల్‌సుఖ్‌నగర్ బస్సు డిపో వైపు నడుస్తున్నాం.

"మిమ్మల్ని ఓ సంగతి అడగనా?"

నేను వెనక్కి తిరిగి అతనికేసి చూసాను. ఏమడుగుతాడు? అప్పా?

అబ్బే...! ఏమో... కాస్త చెప్పు కుట్టినందుకు అయిదు రూపాయలిచ్చిన దుబారా మనిషిః జీతం డబ్బులు ఖర్చు చేసి వుండొచ్చు.

"అడగండి" అన్నాను.

"ఇంతకుముందు వాళ్ళు 'మేం బ్రాహ్మలం మమ్మల్ని సత్కరించండి' అంటే, మీరు పదిరూపాయలిచ్చి వాళ్ళని సత్కరించారు. అది మన సంస్కృతిలో భాగమన్నారు. ఇప్పుడు మీ చెప్పుకుట్టిన మల్లయ్య సంగతేమిటి? ఇదికూడా మన సంస్కృతిలో భాగమేనా, కాదా?"

నారాయణ ప్రశ్న నాకేమీ అర్థంకాలేదు. మల్లయ్య సంస్కృతిలో సంస్కృతిలో భాగం కావడమేమిటి?

"మన సంస్కృతి గర్వపడ తగిందని మీరంటూ వుంటారు. మల్లయ్య తను ఫలానా గొప్పవాణ్ణని చెప్పుకుని, సత్కరించమని కోరలేదు. ఎవర్నీ ఏ సహాయమూచెయ్యమని అడగలేదు. నిజంగా అడుక్కోవల్సిన పరిస్థితిలో వుండి కూడా అడుక్కోలేదు. రెండు పాత చెప్పులు ముందరేసుకుని, అదుగో... అక్కడ కూచున్నాడు! గర్వపడతగిన సంస్కృతి ఇదే. ఇదేనని నేననుకుంటున్నాను...."


నారాయణ గొంతు ఆవేశంతో, ఉద్వేగంతో వణికినట్టుంది. ఆ ముఖంలో నిజంగానే గర్వం పొంగినట్టుంది.

"మీరు చెప్పే సంస్కృతికీ. దీనికీ ఎక్కడా పోలికేలేదు. భిన్నత్వంలో ఏకత్వమూ. ఏకత్వంలో భిన్నత్వమూ వుండటం మన సంస్కృతి గొప్పతనం అని మీరేకాదు. ఎందరో అంటూ వుంటారు. కానీ. ఈ భిన్నత్వంలో ఏకత్వం ఎక్కడుందో తెలీదు. బహుశా, వందల, వేల సంవత్సరాల నుంచీ ఇవి రెండూ వేరువేరుగానే వుంటున్నాయి. రెండూ వున్నాయి కనుక, ఏకత్వం వున్నట్టా?"

నారాయణ చెబుతున్నది నాకిప్పటికీ అర్థం కాలేదు. అతనెప్పుడు బస్సెక్కి వెళ్ళిపోయాడో, నేను గమనించనేలేదు. తను ఫలానా గొప్పవాణ్ణని మల్లయ్య ఎలా చెప్పుకుంటాడు? ఏముంది గొప్ప? చెప్పులు కుట్టడం తప్ప తనకు మరేమీ తెలీదు కనుక, ఆ పనే చేస్తున్నాడు. అందులో గొప్ప ఏముంది? అదా, గర్వపడతగిన సంస్కృతి! సంస్కృతి అంటే, అంత తేలికైన విషయమా? నారాయణంటే, నాకిప్పుడు ముందటికంటే చిరాకు ఎక్కువైంది. అతనంటే నాకెందుకో చిరాకు అని మొదట చెప్పాను గదా, ఎందుకయిందీ ఇప్పుడు మీకూ అర్థమయ్యే వుంటుంది.

## యే దిల్ మాంగే మోర్

"ఒకసారి ఫిరోజ్‌షా కోట్ల స్టేడియంలో ఇమ్రాన్‌ఖాన్ నెట్‌ప్రాక్టీస్ చేస్తున్నాడు. అతన్ని చూడగానే ఒకరకమైన ఉద్వేగం కలిగింది. ఆటోగ్రాఫ్ అంటూ దగ్గరకు వెళ్ళాను. చాలా అప్‌సెట్ అయ్యాడు. బ్యాట్‌తో నన్ను కొట్టడానికన్నట్టు మీదకొచ్చాడు. అప్పుడు అతనలా చేయడం వెనుక ఎలాంటి ఒత్తిళ్లు పని చేసాయో ఇప్పుడు నాకంటూ ఓ ఇమేజ్ వచ్చిన తర్వాత అర్థమవుతోంది" - పై మాటలు బాలీవుడ్ అగ్రనటుడు షారుఖ్‌ఖాన్‌వి. క్రికెట్ అంటే ఎంతో ప్రేమించే షారుఖ్‌ఖాన్‌కు మరోసారి కూడా కర్ట్‌లీఅంబ్రోస్ విషయంలో అలాగే జరిగిందట. ఆంబ్రోస్‌ను అభిమానించే షారుఖ్ అతన్ని ఓ రెస్టారెంట్‌లో చూడగానే వెళ్ళి పలకరించాడట. అప్పటి వరల్డ్‌కప్‌లో సెమీఫైనల్స్‌లో ఓడిన బాధతో ఉన్న ఆంబ్రోస్ షారుఖ్ మీద విరుచుకుపడ్డాడు. ఒక్కసారిగా రెస్టారెంట్ అంతా అల్లరల్లరి అయిపోయిందట. చిన్నప్పుడు స్కూల్ టోర్నమెంటులు ఎన్నో ఆడిన షారుఖ్‌కు వెన్నెముక నొప్పి లేకుంటే కాలేజీలోనో క్రికెట్ కంటిన్యూ చేసేవాడట. ఇంతకూ చెప్పొచ్చేదేమంటే పాకిస్తాన్ టీం అంతా షారుఖ్ అభిమానులేనట. శ్రీలంక జట్టు డిటో. 'మా అబ్బాయి కోసం ఆటోగ్రాఫ్ ఇమ్మని అడిగితే సచిన్ తెగసిగ్గుపడిపోయాడు ఓసారి. సచిన్ ఆడుతుంటే చూడటం నాకు చాలాచాలా ఇష్టం' అనే షారుఖ్‌ఖాన్ 'అనుకున్నవి సాధించాలంటే జీవితంలో సమయాన్ని వృధా చేయకూడదు' అని గట్టిగా చెబుతుంటాడు కూడా!



## "కృషితో నాస్తి దుర్భిక్షం"

## నాకు మార్గదర్శకం

చదువు కోవాల్సిన వయసులో చదువుకోలేకపోయిన నేను ఉద్యోగం చేస్తూ చదువుకున్నాను. నాలో ఇంకా చదవాలన్న తపన.



మాది శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చివోలు అనే పల్లె మాది. శ్రీకాళహస్తిలోని ఆర్.పి.బి.ఎస్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో 12వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేటప్పుడు కుటుంబ సమస్యల వలన అందులో ఒక మార్కు తేడాతో ఫెయిల్ అయ్యాను. నా తల్లిదండ్రుల కోరిక మేరకు వ్యవసాయం చేయడానికి వెళ్ళడం జరిగింది. అప్పుడే ఊరికి ఏదో చేయాలనే తపన. గ్రామంలోని యువకులందరం కలిసి 'బాపూజీ గ్రంథాలయం' స్థాపించాం. ఎలాంటి వైద్యసదుపాయాలు లేని మా గ్రామంలోని ప్ర... కు సేవ చేయాల ఉద్దేశంతో ఆర్.ఎం.పి కోర్సు పూ... శ్రీకాళహస్తిలో డా. పున్నారావు దగ్గర రెండు సంవత్సరాలు కాంపౌండరుగా పనిచేసి తిరిగి మా గ్రామానికి వచ్చి వైద్య సేవలు ఎంతగానో అందించాను. 1980 నుండి

## స్వగతం

ప్రభుత్వం తరఫున వయోజన విద్యా కార్యకర్తగా నిరక్షరాస్యత రూపుమాపడానికి తీవ్రంగా కృషి చేశాను. దీనిపై వివిధ పత్రికలలో కవితలు, వ్యాసాలు రాశాను. రెండు సంవత్సరాలు సంచార గ్రంథాలయ కార్యకర్తగా చుట్టుపక్కల గ్రామాల్లో పనిచేసి అదే డిపార్టుమెంట్‌లో పలమనేరు వయోజన విద్యా ప్రాజెక్టులో అటెండరుగా ప్రభుత్వ పూర్తిస్థాయి ఉద్యోగిగా 1985లో మారాను.

పలమనేరులో పనిచేసే రోజుల్లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ ప్రభుత్వ పాలనా శాస్త్రంలో ద్వితీయ శ్రేణిలో పాసయ్యాను. గవర్నమెంటు వారి ఆదేశాల మేరకు అక్కడ నుండి చిత్తూరులోని రేడియో ...ంజనీరు ఆఫీసు, సమాచార, పౌరసంబంధ శాఖకు ...ను. ఇక్కడ నుండి అన్నామలై యూనివర్సిటీ నుండి పి.జి డిప్లమో ఇన్ పబ్లిక్ రిలేషన్స్‌లో డిగ్రీ పొందాను. ఇప్పుడు జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సాహిత్యం అంటే నాకెంతో అభిమానం. వివిధ పత్రికల్లో కవితలు, చిన్నచిన్న ఆర్టికల్స్ రాస్తున్నాను. ఎందరో ఉద్యోగులు (మధ్యలో చదువు నిలిపినవారిని) చదువుకోవాల్సిందిగా ప్రోత్సహిస్తున్నాను. ఎం.ఎ డిగ్రీని స్నా... కోత్సవములో తీసుకోవడం నాకెంతో ఆనందాన్నిచ్చి...

నేటి యువతరానికి నాదొక చిన్న విన్నపం. చదివే వయస్సులో అనవసర వ్యాపకాలు పెట్టుకోవద్దు. ... కాలాన్ని సద్వినియోగపరచుకుని ప్రణాళికాబద్ధంగా, కష్టపడి చదివితే ఫలితం తప్పక వుంటుంది.

– జలగం శ్రీనివాసులు,
చిత్తూరు